యోగా గురువు రూహి కన్నుమూత

రాంగోపాల్‌పేట్: ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ భార్య యోగా గురువు రూహి అనారోగ్యంతో కన్నుమూశారు. జనవరి 27వ తేదీన ఆమె అనారోగ్యంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, శరీరంలోని అవయవాలు పనిచేయకపోవడంతో గురువారం సాయంత్రం కన్నుమూసినట్లు వైద్యులు తెలిపారు. సెంథిల్ కుమార్–రూహికి 2009లో వివాహం జరిగింది. ఆమె వృత్తిరీత్యా యోగా గురువుగా ఉన్నారు. సెంథిల్‌కుమార్ రాజమౌళికి చెందిన పలు సినిమాలకు కెమెరామెన్‌గా పనిచేశారు.

ఎస్సార్‌నగర్ డీఐగా జానకి రాములు



అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా గాదరి జానకి రాములు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రఘురామరాజు ఇటీవల బదిలీపై వెళ్లగా గురువారం నూతన డీఐగా బాధ్యతలు స్వీకరించారు. మెదక్‌లో ఎస్సైగా పనిచేసిన ఈయన పదోన్నతి పొంది నల్గొండ జిల్లా సీబీడీ విభాగానికి వెళ్లారు. అక్కడి నుంచి బదిలీపై ఎస్‌ఆర్‌నగర్‌కు వచ్చారు.

బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా రామయ్య



సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సీహెచ్.రామయ్య బాధ్యతలు చేపట్టారు. మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఆయనకు ఇటీవల జరిగిన బదిలీల్లో బేగంపేట లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. అసాంఘిక శక్తుల అణచివేతకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని న్నారు. ఎలాంటి అన్యాయం జరిగినా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి!

- బేగంపేట నాలాలో రసాయన వ్యర్థ జలాలు
- ఘాటైన వాసనలతో రాకపోకలకు ఇబ్బందులు

సనత్‌నగర్: కూకట్‌పల్లి నుంచి బేగంపేట్ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు ప్రవహించే నాలాలో పారిశ్రామిక వ్యర్థజలాలు ప్రవహిస్తుండడంతో నాలా పరీవాహక ప్రాంతవాసులు ఘటైన వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు పారిశ్రామిక వ్యర్థ రసాయనాలు..మరోవైపు డ్రైనేజీ నీరు నాలాలో వచ్చి కలుస్తుండడంతో బేగంపేట్ నాలా ఇరువైపులా ఉన్న ప్రాంతవాసుల ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. కనీసం పూడికతీత పనులైనా సక్రమంగా జరిగాయా అనుకుంటే అదీ లేదు. తూతూమంత్రంగానే పూడికతీత పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు దులుపుకోవడంతో నాలాలో నీరు సాఫీగా ప్రవహించడం లేదు. దీనికి తోడు కొత్తగా వ్యర్థాలను నాలాల్లోకి విసిరేస్తుండడంతో నీటి ప్రవాహానికి మరింత అడ్డంకిగా మారుతోంది.

భారీ వ్యర్థాల మూటల పారబోత..

వ్యాపార, వాణిజ్య, హోటళ్ల నిర్వాహకులు తమ తమ సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను తరలించాలంటే జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది భారీగా డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో ఇచ్చుకునే బదులు తామే స్వయంగా సిబ్బందితో సమీప నాలాల్లో పడేస్తే పోలా అన్న భావనతో చాలా మంది బేగంపేట్ నాలాలో పెద్ద పెద్ద మూటలను తీసుకొచ్చి పడేస్తుండడం పరిపాటిగా మారింది. ఫతేనగర్ నుంచి బేగంపేట్ ఫ్లై ఓవర్ వరకు నీటి ప్రవాహం వేగంగానే ఉన్నప్పటికీ ఆ తరువాత నీటి ప్రవాహం ఒక్కసారిగా పడిపోతోంది. దీంతో నీటి కదలిక లేక మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాల వాసనకు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా నాలాను ఆనుకుని ఉన్న బేగంపేట్ అల్లంతోట బావి, మయూరిమార్గ్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, బ్రాహ్మణ్‌వాడీ, ఓల్డ్‌కస్టమ్స్ ప్రజలు ఘాటైన వ్యర్థ జలాలతో అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలను నాలాలోకి విసరకుండా ఉండేలా పారిశుద్ధ్య విభాగం అధికారులు ఎత్తుగా గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేస్తున్నా వాటిని సైతం లెక్కచేయకుండా కొందరు వ్యర్థాలను నాలాల్లోనే పడేస్తున్నారు.

ఇలా చేస్తే సమస్యకు పరిష్కారం..

పూడికతీత ప్రక్రియను శాస్త్రీయంగా అంటే నాలాలో తీసిన మట్టిని అక్కడే పడేయకుండా బయటకు తరలించాలి. కానీ పూర్తిస్థాయిలో అలా జరగడం లేదు. వ్యర్థాలను మూటలు గట్టి నాలాల్లో వడేయకుండా నాలా పొడవునా ఎత్తైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. లేదంటే వ్యర్థాలను పడేస్తున్న వారిపై నిఘా ఉంచి వారికి జరిమానాలు విధించడమో లేక చట్టపరమైన చర్యలు తీసుకోవడమే చేయాలి. ఇక పారిశ్రామిక వ్యర్థ జలాలను ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ)లకు మళ్లించి శుద్ధి చేయాలి. ఫతేనగర్ వద్ద ఈటీపీ ఉన్నప్పటికీ భారీగా వచ్చి చేరుతున్న జలాలతో దాని సామర్థ్యం సరిపోవడం లేదని తెలుస్తోంది. దీంతో యథావిధిగా బేగంపేట్ వైపు రసాయనిక వ్యర్థ జలాల ప్రవాహం నిత్యం జరుగుతూనే ఉంటోంది. దీనిని నివారించాలంటే మరిన్ని ఈటీపీలు ఏర్పాటు చేయడం లేదా పరిశ్రమల్లోనే వాటిని సమకూర్చుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

లక్షలు వెచ్చిస్తున్నా..

బేగంపేట నాలా పూడికతీత పనుల నిమిత్తం ప్రతియేటా లక్షలు వెచ్చిస్తుంటారు. అయితే పూడికతీత పనులు పూర్తయ్యాయని రికార్డుల వరకు ఓకే వాస్తవ పరిస్థితి చూస్తే మాత్రం దానికి భిన్నంగా ఉంటుంది. పైపైన పూడికతీత పనులు చేపట్టడానికి తోడు కొత్తగా వ్యర్థాలను నాలాల్లోకి పడేయడంతో నీటి ప్రవాహం ఆశించినంత స్థాయిలో జరగడం లేదు. భారీ వర్షాకాలంలో మాత్రమే వ్యర్థాలు కొట్టుకుపోతుంటాయి. ఆ తర్వాత ఎక్కడ వ్యర్థాలు అక్కడే ఉండడానికి తోడు మురుగునీరు కూడా నిలిచిపోతుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నాయని స్థానికులు లబోదిబోమంటున్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 16(నేడు) రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, వెంకన్నస్వామికి విశేష అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య సంస్థాన పీఠాధిపతి అభినవోద్దండ విద్యా శంకరభారతీ స్వామి ఉదయం 10.30 గంటలకు ఆలయాన్ని సందర్శించి రథ సప్తమి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వేడుకల అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి సలహాలు, సూచనలు అందిస్తారని వివరించారు. భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు,ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని రథసప్తమి వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ ఛైర్మన్లు వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఆలయ కార్య నిర్వహణాధికారి రాజేష్‌కుమార్ కోరారు.

బాపూనగర్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు



వేడుకలో పాల్గొన్న రవిశేఖర్‌రెడ్డి

అమీర్‌పేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు బాపూనగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సమాజ శ్రేయస్సుకు ఆయన చూపించిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి. రవిశేఖర్‌రెడ్డి హాజరై సేవాలాల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హరిసింగ్‌జాదవ్, మనోజ్‌కుమార్. తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తల బలం

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్



మాట్లాడుతున్న మోహన్ యాదవ్

కంటోన్మెంట్: బీజేపీకి కార్యకర్తలే బలమని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ ఇంపీరియేల్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అయోధ్యలో రామమందిరం విషయంలో సుప్రీం కోర్టును గౌరవవించలేని వ్యక్తి హైదరాబాద్ నుంచి పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు అర్హత లేదన్నారు. బీజేపీలో మాత్రమే ఓ సామాన్య వ్యక్తి సైతం అత్యున్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. హిందూ, ముస్లింల మధ్య విభేదాలకు కాంగ్రెస్ పార్టే కారణమన్నారు. వచ్చే ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం సహకారం లేకుండా హైదరాబాద్ అభివృద్ధి లేదని రూ.26వేల కోట్లతో హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మురళీధర్ రావు, ఈటల రాజేందర్, మర్రి శశిధర్ రెడ్డి, గౌతమ్, శ్యామ్ సుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఓయూ విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

లాలాపేట: తమకు గత నెల రోజుల నుంచి నాసిరకం, పురుగుల అన్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి తార్నాకలోని ఇంటర్నేషనల్ హాస్టల్‌లో ఉంటున్న పీజీ విద్యార్థులు తార్నాక ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఎంతో కష్టపడి సీటు సాధించి ఓయూలో చదువుకోవడానికి వచ్చిన తమకు యూనివర్సిటీ అధికారులు సరైన భోజనం పెట్టడం లేదన్నారు. నాసిరకమైన భోజనం విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దాదాపు గంట పాటు తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిపైకి రావడంతో ఇటు లాలాపేట.. అటు మెట్టుగూడ వరకు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఓయూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులు సముదాయించారు. సమస్యను పరిష్కరించేలా ప్రిన్సిపాల్, చీఫ్ వార్డెన్‌తో ఫోన్‌లో మాట్లాడించడంతో విద్యార్థులు శాంతించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కండువా కప్పి బీజేపీలో ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్వీఐటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పీఎల్ శ్రీనివాస్, ఆయన కుమార్తె పీఎల్ అలేఖ్య బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పీఎల్ శ్రీనివాస్, ఆయన కుమార్తె అలేఖ్య బీజేపీలో చేరడం తమ పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు లేని అంశాలను తెరమీదకు తెస్తూ మోదీకి ఉన్న అనుకూల వాతావరణం నుంచి ప్రజల దృష్టిని మరల్చే రాజకీయాలకు తెరలేపే ప్రయత్నం చేస్తున్నారని కానీ రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశ గౌరవాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తించేలా మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్, బీబీనగర్‌లో ఎయిమ్స్ మెడికల్ కాలేజీల ఏర్పాటు, రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రూ.350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ చర్లపల్లి, బీహెచ్ఈఎల్ టర్మినల్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీని బలపరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేశారని రాబోయే రోజుల్లో ఎంతో మంది యువతులు, చదువుకున్న మహిళలు రాజకీయాల్లోకి వచ్చి రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక, పెద్ది రవీందర్, సారంగపాణి పాల్గొన్నారు.

రైళ్లలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండండి

- పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్ల అందజేత
- రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్



సెల్‌ఫోన్లు అందుకున్న వారితో డీజీపీ మహేష్ భగవత్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలోని రైళ్లు, స్టేషన్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న, దొంగిలించబడిన 150 సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్ బాధితులకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని కాజీపేట్, నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ పరిధిలోని రైళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, చోరీలకు గురి కావడంపై బాధితులు ఫిర్యాదు చేశారు. తాము సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించి తద్వారా సెల్‌ఫోన్లు ఎవరెవరు ఎత్తుకెళ్లారు, సదరు సెల్‌ఫోన్లు ఎవరు ఉపయోగిస్తున్నారు అనే వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించాం. కేవలం నెల రోజుల్లోనే 150 సెల్‌ఫోన్లను వివిధ రాష్ట్రాలతో పాటు సికింద్రాబాద్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, కాచిగూడ సీఐ ఎల్లప్ప, ఐటీ బృందం ఎస్ఐ కుమార్, మాజీద్ పాల్గొన్నారు.

- రైళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రయాణికుల వద్దకు వచ్చి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చామని.. ఊరికి వెళ్లేందుకు ఛార్జీలు లేవని మాయమాటలు చెప్పి దొంగిలించిన సెల్‌ఫోన్లను రూ. 1000, రూ. 2000 వేలకు విక్రయిస్తుంటారని చెప్పారు. అలాంటి సెల్‌ఫోన్లు కొనుగోలు చేసి వినియోగిస్తే రైల్వే పోలీసులు ఫోన్ చేస్తారని, సదరు ఫోన్‌ను అప్పగిస్తే బాగుంటుందని లేకుంటే కేసు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. కేరళలో 5, ఉత్తర్‌ప్రదేశ్‌లో 4, మహారాష్ట్ర 13, కర్ణాటక 11, మధ్యప్రదేశ్ 8, బీహార్ 6, తమిళనాడు 7తో పాటు ఏపీ 38, తెలంగాణలో 58 సెల్‌ఫోన్లు రైళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల వద్ద నుంచి దొంగిలిచబడిన 150 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు.

ఏసీపీకి పలువురి అభినందనలు



ఏసీపీ జగన్‌ను సన్మానిస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: నూతన ఓయూ ఏసీపీ జగన్‌కు వివిధ విద్యార్థి సంఘాల నేతలు అభినందనలు తెలిపారు. గురువారం బహుజన జేఏసీ ఛైర్మన్ వేల్పుల సంజయ్, ఓయూ జాక్ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి, పరిశోధన విద్యార్థి గద్దెల అంజిబాబు తదితరులు ఏసీపీ జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. గతంలో సీఐగా పని చేసి జగన్ ఓయూ విద్యార్థి నేతలకు సుపరిచితుడు కావడంతో విద్యార్థి నేతలు ఆయన నియామకం పట్ల ఆనందం వెలిబుచ్చారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

చిలకలగూడ: కార్మిక హక్కుల పరిరక్షణకు ఈనెల 16న (నేడు) నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతిఒక్కరు భాగస్వాములై జయప్రదం చేయాలని ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు కోరారు. సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ ఆటో స్టాండ్ వద్ద గురువారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటోడ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని అన్నివిధాల ఆదుకోవాలన్నారు. ఓలా, ఉబర్ సంస్థలను నిషేధించి, 50 ఏళ్లు పైబడిన ఆటో డ్రైవర్లకు పింఛన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, లక్ష్మణ్, రమేష్, శ్రీహరి, ఆంజనేయులు, శివకుమార్, రవి, ప్రవీణ్, యాదగిరి పాల్గొన్నారు.

స్టేడియానికి మరమ్మతులు చేయండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియానికి నిర్వహణ కరువై అధ్వానంగా తయారైందని సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. కిషోర్ యాదవ్ అన్నారు.గురువారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల స్టేడియంలో తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టారన్నారు. నీటి వసతి లేక టాయిలెట్లు దుర్గంధంగా మారాయని గోడలకు పగుళ్లు వచ్చాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్టేడియంలో మరమ్మతులు చేపట్టాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో అడ్వొకేట్ నూతన్ క్రాంతి, యూత్ కాంగ్రెస్ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు బండి అభిషేక్, మెట్టుగూడ డివిజన్ ప్రసిడెంట్ ఎం. రవి, తార్నాక డివిజన్ వైస్ ప్రసిడెంట్ ఈఎస్ రవి ఉన్నారు.

సన్మానం



పురేందర్‌రెడ్డిని సన్మానించిన మహిళలు

సనత్‌నగర్: మహిళలు నిర్భయంగా తమకు జరిగిన అన్యాయాలపై నిలదీసినప్పుడే అసాంఘిక శక్తుల ఆట కట్టించవచ్చని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పురేందర్‌రెడ్డిని సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోట మణిమాల ఆధ్వర్యంలో మహిళలు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు సూచించారు.వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూఅశోక్‌నగర్, రామాలయం వద్ద ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధార్ కార్డులో మార్పులు, హెల్త్ సెంటర్, బ్యాంక్ సేవలు, ఆయుష్మాన్ భారత్ తదితర కేంద్ర ప్రభుత్వ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ ముదిరాజ్, మేకల సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, కన్నాభిరం, ఓంప్రకాష్, సత్యనారాయణ, నాగరాణి, యాదమ్మ, సుబ్బారావు, శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'డిజైన్ యువర్ స్టోరీ'



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్తీషా, కరిష్మా మెహతా, రిధి ఖోస్లా జలన్

సనత్‌నగర్: యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో గురువారం 'డిజైన్ యువర్ స్టోరీ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వేదికగా పలువురు జీవితాలను ఆవిష్కరించి వారిని ఆదుకునేందుకు చేపట్టిన కార్యక్రమాలను వివరించి స్ఫూర్తిని నింపారు. వైఎఫ్ఎల్ఓ ఛైర్ పర్సన్ ఆర్తీషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత, ఫొటోగ్రాఫర్ కరిష్మా మెహతా, ప్రముఖ వక్త రిధి ఖోస్లా జలాన్ హాజరై తమ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. హ్యూమన్ ఆఫ్ బాంబే పేరుతో రూపొందించిన కథలు ప్రజలను ఆలోచింపజేయడమే కాకుండా వారి జీవితాలపై ప్రభావం చూపిందన్నారు. తమ కథనాల ద్వారా చాలా మంది మహిళలకు ఆర్థికంగా చేయూతను కూడా ఇచ్చామన్నారు. 'ఓ మహిళకు ఐదుగురు కుమార్తెలు కాగా మగ పిల్లవాడు కావాలని ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. మద్యానికి బానిసైన భర్త ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె ఆస్పత్రిలో చేరగా భర్త జైలు పాలయ్యాడు. ఆ సమయంలో తమ కథనం వారికి ఆర్థిక భద్రత కల్పించిందని, తద్వారా రూ.25 లక్షలు సేకరించి అందజేసినట్లు గుర్తు చేశారు. మరో ఘటనలో జమ్మూ కశ్మీర్‌కు చెందిన అలీబాయ్ చేయని నేరానికి 23 సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. తాము అతనికి ఆర్థిక సహాయం చేసినట్లు వివరించారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



ప్రభుత్వ స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్ బీ–కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్రహరీ తో పాటు గేటు ఏర్పాటు చేయడంతో ఇందిరానగర్ వాసులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలంటూ మారేడుపల్లి రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆర్ఐ రాధిక, ఇతర అధికారులు, సిబ్బంది వచ్చి ప్రభుత్వ స్థలానికి ఏర్పాటు చేసిన ప్రహరీ, గేటును తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ఈ స్థలంలో చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహేశ్, కాలనీ వాసులు సత్యనారాయణ, అరవింద్, డేంజిల్, వనజ, భాను పాల్గొన్నారు.

'న్యూట్రియిడ్' యాప్ ఆవిష్కరణ

లాలాపేట: ఆరోగ్యకర, స్థిరమైన పోషకాహారం కోసం వినియోగదారులను శక్తివంతం చేయడానికి రూపొందించిన వినూత్న, సమగ్రమైన మొబైల్ యాప్ 'న్యూట్రియిడ్'ను ఐసీఎంఐఆర్–నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డా. హేమలత, ఆగ్స్‌బర్గ్‌లోని అర్బన్ క్లైమేట్ రెసిలెన్స్ ఛైర్ ప్రొఫెసర్ మార్కస్ కెక్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. ఇండో–జర్మన్ సహకారంతో ఈ యాప్‌ను అభివృద్ధి చేశామన్నారు. దాదాపు రెండేళ్ల నుంచి నుంచి పలు పరిశోధనల తర్వాత న్యూట్రీఎయిడ్ యాప్ బీటా వర్షన్‌ను ప్రారంభించామన్నారు. న్యూట్రీఎయిడ్ అనేది కేవలం క్యాలరీల లెక్కింపు యాప్ మాత్రమే కాక మైక్రో విటమిన్స్, మినరల్స్‌ను ఎంతో తీసుకుంటాన్నాము అనే సమాచారాన్ని తెలియజేస్తుందన్నారు. దీంతో పాటు మనం తీసుకునే ఆహారం ప్రకృతిపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని చెబుతుందన్నారు. ఈ యాప్‌ను నగరంలో దాదాపు 720 ఆహారాల నమూనాలపై ప్రయోగాత్మకంగా రూపొందించినట్లు డైరెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో ప్రాంతీయంగా ప్రజలకు ఉపయోగపడేలా ఈ మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, లేనా హెన్నెస్, కాల్వరీ వెల్‌నెస్ డైరెక్టర్ వినీత్ సింగ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



యాప్‌ను విడుదల చేస్తున్న హేమలత, తదితరులు

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సభ్యులు

అడ్డగుట్ట: బడీడు పిల్లలందరిని బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సీఆర్పీఎఫ్, మదర్స్ కమిటీ సభ్యులు తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్కూల్ డ్రాప్ అవుట్ పిల్లలను స్కూళ్లకు, క్యాంపులకు పంపించాలని ఇంటింటికి తిరిగి పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో నక్క శోభ, భాగ్య, సువర్ణ, నర్సింగ్‌రావు, అజయ్ బాబు పాల్గొన్నారు.